ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 22 మే 2024



ఎస్ఎస్ఎల్‌సీలో గ్రేస్‌మార్కులు ఉండవు

● విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ సప్లిమెంటరీ పరీక్షల్లో గ్రేస్ మార్కులు ఉండవని విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప స్పష్టం చేశారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సప్లిమెంటరీ లో ప్రతి సబ్జెక్టుకు 20 గ్రేస్‌మార్కులు ఉంటాయని భావించరాదని తెలిపారు. పరీక్షల ప్రాధాన్యత పెంచాలని గ్రేస్‌మార్కులను రద్దు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు రెండుసార్లు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రెండింటికీ గ్రేస్‌మార్కులు ఉండవని పేర్కొన్నారు.



మంత్రుల్లో వణుకు

● భవితవ్యం తేల్చనున్న లోక్‌సభ ఫలితాలు ● మేజర్ సర్జరీ అంటూ కాంగ్రెస్‌లో గుసగుసలు
● వారసులకు టిక్కెట్లు దక్కించుకుని తంటాలు ● సీఎం, డీసీఎం చుట్టూ ఆశావహుల ప్రదక్షిణ

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని ఎందరో సీనియర్ నేతల భవితవ్యాన్ని మార్చేలా ఉన్నాయి. ఫలితాలకు ముందే మంత్రులకు వణుకు పట్టుకుంటోంది. జూన్ మొదటి వారం తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో మేజర్ సర్జరీ ఉంటుందని కాంగ్రెస్‌లో అప్పుడే గుసగుసలు మొదలయ్యాయి. మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నవారు ప్రయత్నాలను ప్రారంభించినట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలు ముగిసిన ఏడాదిలోగానే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. శాసనసభ ఎన్నికలవేళ ఐదు గ్యారెంటీలతోపాటు అప్పటి బీజేపీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు ప్రచారం చేయడంలో సఫలీకృతులై తిరుగులేని మెజారిటీ సాధించారు. ఈలోగానే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల వేటలో భారీ కసరత్తులు సాగాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు పార్టీ అధిష్ఠానం పలు షరతులు విధించింది. మీరే అభ్యర్థి అవుతారా..? మీ తరఫున ఎవరినైనా పోటీ చేయిస్తారా.. లేదా మీ కుటుంబంలో ఎవరైనా ఉన్నారా అనేలా ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇదే కారణంతోనే దాదాపు పదిమంది మంత్రులు వారసులతోపాటు కుటుంబ సభ్యులకు టిక్కెట్లు దక్కించుకున్నారు. గెలిస్తే తమకంటే గొప్పగా ఢిల్లీలో ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తారని, లేదంటే రాజకీయంగా అడుగులు వేసేందుకు మార్గం ఏర్పడుతుందని భావించారు. ఇటీవల సాగుతున్న చర్చల్లో ఎంపీలుగా ఓడినా ఇన్‌చార్జ్ మంత్రులపై వేటు వేయాలనే అంశం హల్‌చల్ చేస్తోంది. అదే జరిగితే ముఖ్యమంత్రి సిద్దరామయ్య కేబినెట్‌లో అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో 12-14 స్థానాల్లో గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. అంతకంటే నాలుగైదు సీట్లు ఎక్కువగానే గెలుస్తామని సిద్దరామయ్య ధీమాతో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి బెంగళూరు గ్రామీణ ఎంపీ డీకే సురేశ్ ఒక్కరే కాంగ్రెస్ నుంచి ఉన్నారు. 28 స్థానాల్లో కాంగ్రెస్ ఒకే స్థానానికే పరిమితంగా ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో 10 స్థానాలకంటే ఎక్కువగెలిస్తే కొంతమేర మాత్రమే మంత్రివర్గంలో మార్పులు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందేందుకు కారకులైన కొందరిని తప్పించే అవకాశం ఉంది. ఒకవేళ 10లోపు స్థానాలైతే మేజర్ సర్జరీ తప్పదనిపిస్తోంది. వారసులు, కుటుంబ సభ్యులకు టిక్కెట్లు దక్కించుకున్నవారు ఓటమికి గురైతే ఏకంగా మంత్రి పదవులు కూడా కోల్పోయే పరిస్థితి నెలకొననుంది. లోక్‌సభ సమరంలో వైఫల్యం తప్పదని భావిస్తున్న కొందరు మంత్రులు అప్పుడే నిరాశతో ఉన్నట్టు తెలుస్తోంది. వారసులు ఓడితే నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందనేది కీలకమవుతోంది. టిక్కెట్లు ఇచ్చే సందర్భంలోనే గెలుపోటములు మీ భవిష్యత్తుపైనే ఆధారపడి ఉంటాయని సూచించినట్టు తెలుస్తోంది. అధిష్ఠానం ఆలోచనలో ఇటువంటి నిర్ణయం ఉందనేది ఒకటి రెండు సందర్భాలలో బహిరంగం కావడంతో ఎన్నికల ఫలితాల తర్వాత ఎటువంటి పరిణామాలు ఉంటాయనేది రసవత్తరమవుతోంది. ఒకవేళ వారసులు, కుటుంబ సభ్యుల్లో ఎక్కువ మంది ఓటమి చెందితే తమకూ అవకాశం దక్కుతుందని ప్రయత్నించేవారు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ చుట్టూ పలు జిల్లాలకు చెందిన నేతలు ప్రదక్షిణలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అనుకున్నదొకటి అయినదొకటి జరుగుతుందేమోననే భయం వెంటాడుతోంది. ఇటీవల కొన్ని రోజులుగా సమసిపోయినట్టుగా మారిన సీఎం వ్యవహారం మరోసారి తెరపైకి వస్తోంది. లోక్‌సభ ఎన్నికల ఎన్నికల తర్వాత డీకే శివకుమార్ సీఎం అవుతారనే చర్చలు జోరందుకుంటున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్‌లో మార్పులపై వస్తున్న చర్చలకు సీఎం సిద్దరామయ్య స్పందిస్తూ అధిష్టానం నిర్ణయం ప్రకారంగానే ఉంటుందని ఇప్పటికైతే మార్పులు చేయాలనే ఆలోచన ఏదీ లేదని దాటవేశారు.



కాంట్రాక్టు ఉద్యోగాల్లో

రిజర్వేషన్

● మహిళలకు 33 శాతం ● ప్రభుత్వం ఆదేశాలు

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగాల నియామకంలోనూ రిజర్వేషన్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు, గ్రూప్ డి, పారిశుధ్య కార్మికులతో కలిపి నియామకాల్లో ఇకపై రిజర్వేషన్లు వర్తిస్తాయి. డిసెంబరు 21న మంత్రివర్గ తీర్మానానికి అనుగుణంగా పాలనా సంస్కరణల విభాగం సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తప్పనిసరి చేశారు. అన్నిశాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బోర్డులు, కార్పొరేషన్లు, యూనివర్సిటీలలోనూ ఇదే వర్తించనుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో కొన్ని పోస్టులు కాంట్రాక్టు ద్వారానే నియమించుకునే విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్ పాలసీ తప్పనిసరి అయ్యింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రస్తుతం అమలులో ఉన్న రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఏ శాఖ అయినా కనీసం 20 మంది అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకుంటే ఈ రిజర్వేషన్ విధానం అమలు చేయాల్సి ఉంటుంది. 45 రోజుల కంటే తక్కువ వ్యవధికి చేసుకునే నియామకాలకు రిజర్వేషన్లు వర్తించవు. ఏటా కేటీపీపీ చట్టానికి అనుగుణంగా కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలకు ఏజెన్సీలకు టెండర్లు ఇస్తారు. ఇకపై రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. సామాజిక న్యాయం, సమాన ఉద్యోగ అవకాశాలు కల్పించే ఆలోచనతో కాంట్రాక్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వ్యవస్థ కల్పించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

5, 8, 9 తరగతుల విద్యార్థులు పాస్



బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా 2023-24 విద్యాసంవత్సరంలో 5, 8, 9 తరగతులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా టెస్ట్‌లు, సెమిస్టర్ పరీక్షలలో మార్కులకు అనుగుణంగా ఉత్తీర్ణులుగా ప్రకటించేలా విద్యాశాఖ ఆదేశించింది. పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫలితాలు వెలువరించకుండా సుప్రీంకోర్టు స్టే విధించిన మేరకు విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. 2024-25 విద్యాసంవత్సరం మరో పది రోజుల్లో ప్రారంభం కానుండడం, ఓవైపు అడ్మిషన్లు సాగుతున్న తరుణంలో ఫలితాలు ప్రకటించకుండా గందరగోళం సృష్టించరాదని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో రానున్న విద్యాసంవత్సరంలో ప్రవేశించేందుకు అభ్యంతరం లేకుండాపోయింది. ఎఫ్ఏ 1, 2, 3, 4తోపాటు ఎస్ఏ 1, 2 లలో వచ్చిన మార్కులకు అనుగుణంగా ఉత్తీర్ణులు చేయాలని ఆదేశించింది. దాదాపు రెండు నెలలుగా సాగిన గందరగోళానికి తెరపడింది.

ద్వితీయ పీయూసీ ఫలితాలు విడుదల

● సప్లిమెంటరీ పరీక్షల్లో 35.25 శాతం ఉత్తీర్ణత



బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూసీ సప్లిమెంటరీ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. 1.48 లక్షల మంది విద్యార్థులు రాయగా 52,505 మంది ఉత్తీర్ణులయ్యారు. 35.25 శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. ఇటీవల జరిగిన పరీక్షల్లో ఫెయిలైన, తక్కువ మార్కులు వచ్చినవారు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. సైన్స్ విభాగంలో అత్యధికంగా 56.16 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కామర్స్‌లో 22.06 శాతం, ఆర్ట్స్‌లో 22.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. తొలిసారి పరీక్షల్లో కన్నడలో 24 మార్కులు రాగా (ఇంప్రూవ్‌మెంట్) బెంగళూరు విద్యాశ్రీ ఈసారి 75మార్కులు సాధించారు. ఇంగ్లీష్‌లో చిక్కబళ్లాపురకు చెందిన ఎంఎస్ గీతా 63 (అదనంగా 37) మార్కులు, హిస్టరీలో కలబురగికి చెందిన సచిన్ 78 (అదనంగా 46) మార్కులు పొందారు. సైన్స్‌లో పలువురు విద్యార్థులు 35 నుంచి 45దాకా అధిక మార్కులు సాధించారు.

తమిళనాడుకు 2.5 టీఎంసీల నీరు విడుదల చేయండి

● రాష్ట్రానికి కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశం

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ బిగ్ షాక్ ఇచ్చింది. కావేరి జలాశయాల నుంచి మే నెల కోటాలో భాగంగా తమిళనాడుకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. మంగళవారం ఢిల్లీలో కావేరి నీటి నియంత్రణా మండలి సమావేశం జరిగింది. ఈ మేరకు కావేరి జలాశయాల నుంచి మే నెల కోటాలో భాగంగా 2.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. కావేరి తీరంలో ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తుండగా జలాశయాలకు నీరు చేరుతోంది. అప్పుడే నీటి విడుదలకు ఆదేశాలు రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మహారాష్ట్రలోని కోయ్నా జలాశయం నుంచి కర్ణాటక పరిధిలోని కృష్ణానదికి నీటి విడుదలకు అంగీకరించారు. ఇటీవల ఉత్తర కర్ణాటక పరిధిలో తాగునీటికి సమస్య ఏర్పడిందని, సీఎం సిద్దరామయ్య, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండేకు లేఖ రాశారు. అందుకు అనుగుణంగా మహారాష్ట్ర సీఎం నీటి విడుదలకు అంగీకరించారు. కోయ్నా జలాశయం నుంచి తగినంత నీరు లభించనున్నట్టు మంత్రి సతీశ్‌జార్కిహోళి తెలిపారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



కేపీసీసీలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

దూరదృష్టిగల నేత రాజీవ్‌గాంధీ

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య
● ఘనంగా నివాళి

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశప్రధానిగా రాజీవ్‌గాంధీ దూరదృష్టితో ఆలోచించారని, కంప్యూటరీకరణ, సాంకేతికతకు ఆయన ప్రాధాన్యత ఇచ్చారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కొనియాడారు. రాజీవ్‌గాంధీ వర్థంతిని పురస్కరించుకుని విధానసౌధలో మంగళవారం ఉగ్రవాద వ్యతిరేక దినంగా ఆచరించారు. ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. చీఫ్ సెక్రటరీ రజనీశ్ గోయెల్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌తోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ వర్థంతిని పురస్కరించుకుని కేపీసీసీలోనూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చారిత్రాత్మక సంక్షేమాలకు రాజీవ్‌గాంధీ బాటలు వేశారని పేర్కొన్నారు. పలు ఆర్థిక సంస్కరణలకు, విదేశీ వ్యవహారాల్లో నూతన ఒరవడికి ఆయన శ్రీకారం చుట్టారన్నారు. ఆయనను ఉగ్రవాదులు దారుణంగా హత మార్చారని విచారం వ్యక్తం చేశారు.



సండూరులో ఇనుపగనుల నుంచి వస్తున్న వరద నీరు...



చిత్రదుర్గ జిల్లాలో రోడ్డు మధ్యలో ఇరుక్కుపోయిన కారు

విస్తారంగా వర్షాలు

● పలు చోట్ల కుంగిన రహదారులు ● కూలిన ఇంటి పైకప్పులు ● స్తంభించిన రాకపోకలు

బళ్లారి గాంధీనగర్, మే 21: నాలుగైదు రోజులుగా విజయనగర, బళ్లారి, చిత్రదుర్గ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఈ కారణంగా పలు గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిత్రదుర్గ జిల్లాలోని ధర్మపుర, అరిశెకెర రోడ్డు కుంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అరిశెకెర వద్ద వెళుతున్న కారు కుంగిన రోడ్డులో ఇరుక్కుపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. చిత్రదుర్గ జిల్లా పరిధిలో హిరియూరు తాలూకా ధర్మపుర ఫిర్కాలో కురిసిన భారీ వర్షాల కారణంగా వేదావతి నది పొంగి ప్రవహిస్తోంది. వేదావతి నది పరివాహక ప్రాంతాల్లో నుంచి వాణివిలాస్ జలాశయానికి 5,680 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఇదే వేదావతి నది బళ్లారి జిల్లా పరిధిలో పిడిహళ్లి ప్రాంతంలో తుంగభద్ర నదిలో కలుస్తుంది. బళ్లారి జిల్లాలో సోమవారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో కొంతమేర ప్రజలకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. కంప్లి పట్టణంలోని 15వ వార్డులో వర్షం కారణంగా ఇంటిపై కప్పు కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. గనులనాడుగా పేరుగాంచిన సండూరు తాలూకాలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో ఎండవేడిమితో మాడిన చెట్లుచేమలు పచ్చదనం అల్లుకుంటున్నాయి. ఎర్రటి ఇనుప గనుల కొండల నుంచి వర్షపునీరు దిగువకు వస్తుండడం చూపరులను ఆకట్టుకుంటోంది. భుజంగనగర్‌లో యల్లమమ్మకు చెందిన ఇంటి పైకప్పు కూలడంతో తాలూకా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సండూరు జీవనాడిగా చెప్పుకుంటున్న నారిహళ్లి జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఎర్రగా మారింది. గత పది రోజులుగా నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో సండూరు కొండల్లో పచ్చదనం అల్లుకుంది. కంప్లిలో 2.36 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. విజయనగర జిల్లాలో కూడా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. కూడ్లిగి తాలూకా కానాహొసల్లి ఫిర్కాలో యంబళి-ఆలూరు మధ్య రోడ్డు కొట్టుకుపోయింది. దొడ్డహళ్లి వద్ద ఈ రోడ్డు ఉండడంతో వాగు ధాటికి రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రస్తుతం ఆలూరు-యంబళి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కానాహసల్లి పరిధిలోని కురిసిన వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. కానాహొసల్లి చుట్టు పక్కల ప్రాంతాల చెరువులు వరద నీటితో కళకళలాడుతున్నాయి. విజయనగర జిల్లా హొసల్లిలో 5.62 మిల్లీ మీటర్లు, బణవికల్లు 3.24, చొక్కజోగిహళ్లిలో 2.62 మి.మీ. వర్షపాతం నమోదయింది. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ నీటి కుంటలు వర్షం నీటితో నిండిపోయాయి.



కంప్లి పట్టణంలో కూలిన ఇంటి పైకప్పు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.52	1,579.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	907
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	0	250
సామర్థ్యం (టీఎంసీలు)	3.38	4.02

ప్రత్యేక పారిశ్రామిక విధానానికి కమిటీ



సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

బళ్లారి సిటీ, మే 21: ఆస్తిపన్ను, ఏపీఎంసీ సెస్, వాణిజ్య, ప్రత్యేక పారిశ్రామిక విధాన రూపకల్పనకు ప్రభుత్వంతో చర్చించడానికి చాంబర్ ఆఫ్ కామర్స్ ఏడుగురు సభ్యుల ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. రాయచూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో మంగళవారం జరిగిన కళ్యాణ్ కర్నాటక రీజియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్గనైజేషన్ సమావేశం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చెర్మన్‌గా బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులుగా రామచంద్ర ప్రభు, మస్కి నాగరాజ్, వెంకటరెడ్డి, అశోకస్వామి హిరూరు, దీపక్ గాలా, అశ్విన్ కోతంబరి ఎంపికయ్యారు.

ఈసందర్భంగా రాయచూర్ సమావేశానికి బీదర్, కల్బుర్గి, రాయచూర్, యాదగిరి, బళ్లారి- విజయనగరం, కొప్పళ జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘాల అధ్యక్షులు , సభ్యులు, రాయచూరు రైస్ మిల్లర్స్ అసోషియేషన్ ఆఫీస్ బేరర్లు హాజరయ్యారు.

బీజేపీ ఎమ్మెల్సీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

బళ్లారి సిటీ, మే 21: ఈశాన్య పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికల నేపథ్యంలో బళ్లారి నగరంలోని జిల్లా బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని విధాన పరిషత్ చీఫ్ రవికుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్‌పాటిల్, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, నాయకులు డాక్టర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మే 21 : కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పటేల్‌కు తమ ఓటును వేసి గెలిపించాలని పట్టభద్రులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు విజ్ఞప్తిచేశారు. జూన్ 3న జరుగనున్న ఈశాన్య పట్టభద్రుల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిరుగుప్ప పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్ల వద్దకు కార్యకర్తలు వెళ్లి ఓటర్లను బృందాల వారీగా కలవాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏడాదిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. గ్యారెంటీ పథకాలు సక్రమంగా అమలవుతున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకులు సతీష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల గెలుపే ధ్యేయంగా పెట్టుకుని పని చేయాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, సీనియర్‌నాయకులు అబ్దుల్ నబీ, వడ్డే మల్లికార్జున, మహమ్మద్ షఫీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి న్యాయవాది వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

వర్షబీభత్సం

- బళ్లారి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- పిడుగుపాటుతో గడ్డివాముల దగ్ధం
- నేలకొరిగిన మునగ, తమలపాకు పంటలు
- ముందస్తు చర్యలకు ఆదేశం



కమలాపురం వద్ద నీటిలో వస్తున్న ఆటో

బళ్లారిరూరల్, మే 21 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా వేదవతి నదిలోకి భారీగా నీరు చేరింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మోకా, పీడీహళ్లి, చేళగుర్కి, రూపనగుడి, శంకరబండ, అమరాపురం తదితర ప్రాంతాలలోని పలు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల వద్ద మోకాళ్లలోతు నీరు నిలిచిపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పిడుగుపాటుకు గడ్డివాముల దగ్ధం

తాలుకాలోని గోడేహాళ్ గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డికి సంబంధించిన మూడు గడ్డివాములపై ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడటంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈలోగా రెండు గడ్డివాములు దగ్ధమైనాయి. దీంతో దాదాపు రూ. 5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు రైతు వాపోయాడు.



పిడుగుపాటుకు కాలిపోతున్న గడ్డివాములు

ఉప్పొంగిన నారళ్ల వాగు

కంప్లి, మే 21 : హొస్పేట, సండూరు పరిధిలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జీవనది అయిన నారళ్ల వాగు పొంగి ప్రవహించింది. అలాగే కమలాపురంలో కూడా ఏ రోడ్డు చూసినా మురుగునీరు నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గాదిగనూరు గ్రామంలో పిడుగుపాటుతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. కూడ్లిగి తాలుకాలోని పావగడకు వెళ్లే తాగునీటి పైపులైన్ పూర్తిగా ధ్వంసమైంది. రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనానికి ఇబ్బంది ఎదురైంది.



ఉజ్జిని వద్ద ధ్వంసమైన రోడ్డు

మునగ, తమలపాకు పంటలకు తీరని నష్టం

వర్షం దెబ్బకు తాలుకా పరిధిలోని మ్యాసిరహట్టి గ్రామానికి చెందిన మల్లమ్మ, నాగరాజు, ఆరు ఎకరాలలో సాగు చేసిన మునగ, తమలపాకు పంటలు పూర్తిగా నేలకొరిగాయి. పంట చేతికొచ్చిన సమయంలో ఇలా నేలపాలు కావడంతో తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆ రైతులు వాపోయారు. అలాగే మాకనడుగు పరిధిలోని కురిహట్టి గ్రామంలో బోరన్నకు చెందిన నాలుగు ఎకరాల మునగ, తమలపాకు పంట కూడా పూర్తిగా నేలపాలైంది. రైతులకు చివరకు అకాల వర్షాలు కన్నీళ్లే మిగిల్చాయి.

ముందస్తు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ ప్రశాంత్ కుమార్

బళ్లారి సిటీ, మే 21: జిల్లాలో వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వాన్ వీడియో హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అకాల వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అదనంగా ప్రతి గ్రామంలో అవగాహన కల్పించేందుకు వైద్యారోగ్య శాఖ కృషిచేయాలన్నారు.



కురిహట్టి గ్రామంలో నేలపాలైన పంటను చూపుతున్న బోరన్న

రైతులకు విత్తనాలు, పనిముట్లు పంపిణీ చేయాలి

కంప్లి, మే 21 : రైతులకు ఖరీఫ్ పంటల కోసం పనిముట్లు, విత్తనాలు సక్రమంగా పంపిణీ చేయాలని ఏఐకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరణ్ణ మాట్లాడుతూ ఇప్పటికే కూడ్లిగి తాలుకాలో పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులకు మాత్రం ఇప్పటివరకు విత్తనాలు కానీ, పనిముట్లు గానీ వ్యవసాయ శాఖ అధికారులు సరఫరా చేయలేదన్నారు. అలాగే మార్కెట్లలో మధ్యవర్తులను నమ్మి ఎక్కడ పడితే అక్కడ విత్తనాలు కొనుగోలు చేయరాదన్నారు. దీనికి తోడు కూడ్లిగి తాలుకాలో వుండే గోశాల కు పశుగ్రాసం కొరత ఏర్పడిందని, సక్రమంగా పశుగ్రాసం అందించాలని కోరారు. అలాగే పూజరహళ్లి చెరువులో ప్రైవేటు వ్యక్తులు సేద్యం చేస్తున్నారని, వారిని ఖాళీ చేయించి చెరువులో అందరికీ అనుకూలంగా నీరు నిలవ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న జలజీవన్‌మిషన్ పనులు నాసిరకంగా జరుగుతుండటంతో పాటు రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని, అధికారులు వాటిపై నిఘావుంచి తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా ఈవో రవికుమార్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ సునిల్ కుమార్, సహాయ అధికారి నీలానాయక్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు హాలేష్, పట్టణ కార్మిక సంఘం అధ్యక్షులు చెన్నప్ప, కరియప్ప, మల్లికార్జున, దుర్గప్ప, సిద్దలింగ స్వామి, బసన్న, హాలికుంటి గద్దెయ్య, దొడ్డప్ప, కరియప్ప తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు, పనిముట్లు అందించాలని మనవి పత్రం ఇస్తున్న దృశ్యం

జంగం విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి సిటీ, మే 21: అల్లీపురంలోని మహదేవ తాతనవర్ సంస్కృత, వేద, జ్యోతిష్య పాఠశాలలో చదవాలనుకునే 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి గాను ఉచిత వసతి సౌకర్యం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫారమ్‌లు శ్రీమఠం కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు ఫోటోతో నింపిన దరఖాస్తు, ఆధార్‌కార్డును మే 31తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. గతంలో సమర్పించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇస్తామని, మరింత సమాచారం కోసం మొబైల్ నం 8748845537, 948006914లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా నరసింహ జయంతి



జయంతి వేడుకలో పాల్గొన్న భక్తులు

బళ్లారి సిటీ, మే 21: శ్రీ నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లావ్యాప్తంగా స్వామివారికి అభిషేకం, పూజలు ఘనంగా జరిగాయి. నరసింహ మంత్ర జపం, మన్యుసూక్త, బలి సూక్త తదితర పారాయణలు జరిగాయి. భక్తులందరికి మహామంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ రాఘవేంద్ర స్వాముల బృందావనానికి, నరసింహ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బలరామాచార్య నరసింహ స్వామిపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో పలువురు భజన మండలి సభ్యులు పాల్గొని భగవంతుని కృపకు పాత్రులయ్యారు.

నీటి వనరులను నిరంతరం తనిఖీ చేయాలి

బళ్లారి సిటీ, మే 21: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, దీనివల్ల వచ్చే వాంతులను నియంత్రించేందుకు అన్ని నీటి వనరులను నిరంతరం పరీక్షించాలని జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సూచించారు. నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో బుదవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహంచి మాట్లాడారు. జిల్లాతో పాటు పలుచోట్ల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామపంచాయితీతో పాటు స్థానిక సంస్థల సహకారంతో అన్ని నీటి వనురులకు నిబంధనల ప్రకారం సకాలంలో క్లోరినేషన్ చేయాలని, నిరంతరం పరీక్షలు నిర్వహించి సమన్వయం పాటించాలన్నారు సమావేశంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్ బాబు మాట్లాడుతూ ఇప్పటివరకూ జిల్లాలోని ముఖ్యమైన జాతరలు, ఉత్సవాల్లో జిల్లా కలరా నియంత్రణ బృందం సమయానికి హాజరె నీటి వనరులు, ఆహార పదార్థాల తయారీ స్థలం తదతరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాసర్జన్ బసారెడ్డి, విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ చిదంబరం, ప్రపంచ ఆరోగ్య సంస్థ బళ్లారి ప్రతినిధి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అబ్దుల్లా, వెంకోబనాయక్, స్త్రీ , శిశు అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప

ప్రజాసమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలి

సిరుగుప్ప, మే 21 : అధికారులు ప్రజాసమస్యలపై తక్షణమే స్పందించాలని లోకాయుక్త డీఎస్పీ వసంతకుమార్ కోరారు. సిరుగుప్ప శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో మంగళవారం లోకాయుక్త అధికారులు తాలుకాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రభుత్వాధికారులు తమ సేవలను ప్రామాణికంగా అందించాలని డీఎస్పీ వసంతకుమార్ పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అధికారులు అవినీతికి పాల్పడరాదని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తాలుకా ప్రజలు పాల్గొన్నారు.

అంజనాద్రి ఆంజనేయ స్వామి హుండీ లెక్కింపు

రూ.30,21,253 ఆదాయం వచ్చినట్టు నిర్ధారణ

బళ్లారి గాంధీనగర్, మే 21: కొప్పళ జిల్లా పరిధిలోని అంజనాద్రి బెట్ట ఆంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం ఆలయ కమిటీ చేపట్టింది. హుండీలో వివిధ దేశాలకు చెందిన నాణేలు బయట పడడంతో విదేశీ పర్యాటకులు హుండీలో స్వామి వారికి తమ దేశ నాణేలను కానుకగా అందజేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉప విభాగం అధికారి క్యాప్టన్ మహేశ్ మాలగిత్తి నేతృత్వంలో అంజినాద్రి దేవస్థానం హుండీ మార్చి27వ తేదీ నుండి మే 21వ తేదీ వరకు రూ.30,21,253 రూపాయల ఆదాయం వచ్చినట్టు తెలిపారు ఈ హుండీ లెక్కింపు పోలీసు బందోబస్తు నడుమ సాగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిర్శిదారులు రవికుమార్, నాయకవాడి, కృష్ణవేణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ హిరేమట్, మహేష్ దలాల, హాలేశ్ గుండి, సిబ్బంది దేవస్థానం వ్యవస్థాకులు వెంకటేష్ పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో నిమగ్నమైన సిబ్బంది

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ - బాలిక మృతి

కంప్లి, మే 21 : తాలుకా పరిధిలోని శివపుర వద్ద మేఘన (18) అనే యువతిని లారీ ఢీకొనడంతో మృతి చెందింది. లారీ హొస్పేట నుంచి కూడ్లిగి వెళుతున్న సమయంలో శివపుర వద్ద ఎదురుగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దానిపై వెనుక కూర్చుని వస్తున్న మేఘన తలకు బలమైన గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బైకు నడిపిన వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కూడ్లిగి పోలీసులు తెలిపారు.

హోసూరు జోన్

నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి



జిల్లా స్కిల్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), మే 21: కృష్ణగిరి జిల్లాలో పరిశ్రమలో నైపుణ్యం కలిగిన కార్మికులకు ఎక్కువ డిమాండ్ ఉందని కలెక్టర్ సరయు తెలిపారు. నైపుణ్య శిక్షణపై ప్రస్తుత స్థితిగతులపై కలెక్టర్ సరయు నేతృత్వంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ దిశగా కార్మికులకు నైపుణ్యం కలిగించేలా జిల్లా స్కిల్ కమిటీ చర్యలు చేపడుతోందన్నారు. పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 4.0 ప్రమాణాలలో నైపుణ్య శిక్షణను అందించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నివేదిక తయారు చేశామన్నారు. హోసూరు ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వృత్తి సాంకేతిక కేంద్రంలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక నైపుణ్య శిక్షణలు అందిస్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతకు వెంటనే మంచి వేతనంతో కూడిన ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పరిశ్రమతో ఉద్యోగాలకు, నైపుణ్యం కలిగిన కార్మికుల డిమాండ్‌కు మధ్య చాలా వ్యత్యాసం ఉందని, ఇందుకోసం వృత్తి శిక్షణా కేంద్రాలు పూర్తిగా విద్యార్థులకు శిక్షణ అందించాలన్నారు. కృష్ణగిరి జిల్లాలో కూడా రెండు ప్రభుత్వ వృత్తి విద్యా శిక్షణా సంస్థలు, నాలుగు ప్రైవేట్ వృత్తి విద్యా శిక్షణా సంస్థలు ఉన్నాయని, నైపుణ్య శిక్షణ పొందాలనుకునే 8, 10, 12 తరగతి అంతకంటే ఎక్కువ అర్హతలు ఉన్న అభ్యర్థులు జూన్ 7లోగా ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

హోసూరు (సిఫ్‌కాట్), మే 21: హోసూరు మొదటి డివిజన్‌లోని సిఫ్‌కాట్ ప్రాంతంలో 30 ఏళ్లుగా ఓ ప్రైవేట్ కాఫీ పౌడర్ తయారీ ఫ్యాక్టరీ కొనసాగుతోందని, ఈ కర్మాగారం నుంచి తరచుగా వచ్చే కాలుష్యం వల్ల సమీపంలోని నివాసాలకు వ్యాపిస్తుండటంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బదులకు గురవుతున్నారని కామరాజ్ నగర్ వాసుల తరపున కాలుష్య నియంత్రణ మండలికి, ఫిర్యాదు చేశారు. కర్మాగారం సమీపంలోని నివాస ప్రాంతాలలో ఉతికిన బట్టలు టెర్రేస్‌పై వేసిన వెంటనే ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలతో నల్లగా రంగుగా మారుతున్నాయన్నారు. పిల్లలు ఆడుకోవడానికి బయటికి వెళ్లితే నల్లటి ధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయానికి ఫలపుష్ప తాంబూలంతో వెళ్లి ఫ్యాక్టరీ నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు. వినతిని స్వీకరించిన కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ సెందిల్‌కుమార్ మాట్లాడుతూ పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కౌంటింగ్ కేంద్రం విధులపై మార్గదర్శకాలు జారీ

హోసూరు(కృష్ణగిరి), మే 21: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలలో పాటించాల్సిన విధులకు సంబంధించి అధికారులకు మంగళవారం ప్రత్యేకంగా కలెక్టర్ మార్గదర్శకాలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ సరయు అధ్యక్షతన కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా కృష్ణగిరి పార్లమెంటు నియోజకవర్గానికి జూన్ 4న ఉదయం 8 గంటలకు కృష్ణగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ జరగనుందన్నారు. ఒక్కో అభ్యర్థికి ప్రధాన ఏజెంట్‌కు ఒక వాహనం మాత్రమే కౌంటింగ్ కేంద్రానికి అనుమతిస్తామన్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి వాహన అనుమతిని పొందాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఫాం 17సీ కాపీని తీసుకురావాలన్నారు. ఎన్నికల పరిశీలకులు తప్ప మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వీధి కుక్కల దాడిలో చిన్నారి బలి..!

రాయచూరు, మే 21 : రాయచూరు తాలూకా సంగంగుంట గ్రామ పంచాయతీ కుర్విహాళ్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక లావణ్య వీధికుక్కల కాటుకు బలైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మరో ఐదుగురు చిన్నారులపై ఒకే రోజు వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచగా వారందరిని ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. మెడవెనుక భాగంలో కుక్క కాటుతో తీవ్ర రక్తస్రావానికి గురైన లావణ్యకు మూడు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉంచి చికిత్సనందించారు. అనంతరం కొంత కోలుకున్న చిన్నారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా అకస్మాత్తుగా రెండు రోజుల క్రితం మృత్యువాతపడింది. దీంతో కుక్కల దాడిలో గాయపడిన మిగతా చిన్నారుల తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామస్థులు పంచాయతీ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వీధికుక్కలు పెరిగిపోయాయని తాము ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు.



మృతి చెందిన చిన్నారి లావణ్య(ఫైల్)

రూ.55 లక్షల గంజాయి పట్టివేత

బళ్లారిరూరల్, మే 21: బళ్లారి కౌల్‌బజార్‌లో ఉంటున్న రిజ్వాన్, ముజాకర్‌లు గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ ధర్మాకర్ తెలిపారు. విచారణలో వారు కర్నూలు జిల్లా ఆదోని మండలం సంత కొల్లూరు గ్రామానికి చెందిన సమీర్, అరవింద్, బోయరవి గంజాయి తీసుకువచ్చి బళ్లారిలో తమకు విక్రయిస్తున్నట్లు తెలిపారన్నారు. దీంతో సంతకొల్లూరు గ్రామానికి చేరుకుని వారి ఇళ్లల్లో నిల్వ వున్న 55 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ. 55లక్షలు వుంటుందని తెలిపారు. ఈ ఐదుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో ఎస్పీ రంజిత్ కుమార్ భండారి సీఐని సిబ్బందిని అభినందించారు.



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రైఫిల్ మిస్ ఫైర్... భద్రతా అధికారి మృతి..!

రాయచూరు, మే 21 : మాన్వి పట్టణ సమీపంలోని కేంద్రియ పారిశ్రామిక భద్రత సంస్థ(సీఐఎస్ఎఫ్)లో పని చేసే అధికారి రవికిరణ్ తుపాకీ మిస్ ఫైర్ కావడంతో మృత్యువాతపడ్డాడు. మంగళవారం మాన్వి పట్టణ సమీపంలోని కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రం వద్ద పనులు ముగించుకుని బస్సులో తిరిగి వస్తుండగా ఆయన వద్ద ఉన్న రైఫిల్ మిస్‌ఫైర్ అయి గొంతుకు తగలడంతో ఆయన మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే హంపయ్య నాయక్ పట్టణంలోని ఆర్‌జీ క్యాంప్‌కు వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

కలిసిమెలిసి జీవనం సాగించాలి

▸▸ హజ్ యాత్రికుల వీడ్కోలు సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని మతాలకు చెందినవారు ఒకే తల్లిబిడ్డల్లా ఉండాలని, అందరూ సమానంగా కలిసిమెలిసి జీవనం సాగించాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. హెగ్డేనగర్‌లోని హజ్‌భవన్‌లో మంగళవారం రాత్రి హజ్ యాత్రకు వెళ్లే వారికి వీడ్కోలు పలికారు. మంత్రులు జమీర్ అహ్మద్, రెహమాన్‌ఖాన్ తోపాటు పలువురు పాల్గొన్నారు. 10,168మంది బయల్దేరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మంగళూరు, కలబురగిలలో హజ్‌భవన్‌ల నిర్మాణానికి గ్రాంట్లు కేటాయిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. హజ్‌కు వెళ్లేవారికి ప్రతిరోజూ భోజన, వసతి కల్పించడంపై మంత్రి జమీర్ అహ్మద్‌ను సీఎం కొనియాడారు.


హజ్‌యాత్రకు సీఎం పచ్చజెండా

రేపు గడిదం శ్రీవారి బ్రహ్మరథోత్సవం


గడిదంలోని లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయం

▸▸ తొలిసారి ప్రత్యేక దర్శనం టిక్కెట్లు

బాగేపల్లి, మే 21: రెండో తిరుమలగా పేరొందిన తాలూకాలోని దేవరగుడిపల్లి (గడిదం)లో కొలువైన లక్ష్మీవెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం ఈనెల 23న గురువారం జరగనుంది. హిందూ ధార్మికసంస్థ, దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈనెల 26వరకు ప్రతిరోజూ స్వామివారికి విశేషపూజలు నిర్వహించనున్నారు. పంచామృతాభిషకం, కల్యాణోత్సవం, సింహ వాహనం, పల్లకీ ఉత్సవాలు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు కే ప్రకాశ్‌రావ్, అశ్వత్థప్పస్వామి, శేషస్వామి ఆధ్వర్యంలో పూజా కైంకర్యాలు ఉంటాయి. గురువారం మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో 12 గంటలకు లక్ష్మీవెంకటరమణస్వామి రథోత్సవం జరగనుంది. ఉత్సవంలో భాగంగా పశువుల పరుష కూడా నిర్వహించనున్నారు. తహసీల్దారు ప్రశాంత్ కే పాటిల్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇదే తొలిసారిగా ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక దర్శనం కోసం రూ.500 టిక్కెట్, సామాన్య దర్శనానికి 100 రూపాయలు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా వచ్చే ఆదాయంతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. లోక్‌సభ కోడ్ అమలులో ఉండడంతో సరళంగా, సాంప్రయదాయంగా రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

బంగారపేట, మే 21: తాలూకా వ్యాప్తంగా వారం రోజులుగా అడపాదడపా వర్షం కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పొలాలను చదును చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. కరువుతో విలవిలలాడిన రైతులకు తొలకరి వర్షాలు ఊరట నిచ్చాయి. నైరుతికి ముందే వర్షాలు కురవడంతో సాగు పనులు ప్రారంభించేందుకు అనుకూలంగా ఉందని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. కొంతమంది నాగలితో దుక్కులు ప్రారంభించగా కలుపు తీయడం, చెత్తను తొలగించడం, ఎరువుకోసం పేడను దిబ్బలుగా వేసే పనులు చేపట్టారు. ఎద్దు లేనివారు ట్రాక్టర్లతో దుక్కులు చేపట్టారు. దీంతో ట్రాక్టర్ల బాడుగలు అమాంతంగా పెరిగాయి. ట్రాక్టర్‌తో దుక్కులు చేయడానికి ఎకరాకు రూ.2,800 బాడుగ నిర్ణయించారు. కాగా కొన్ని స్వచ్ఛంద సంస్థలు రైతులకు వ్యవసాయ ఉపకరణాలను యంత్రధారె పథకం కింద తక్కువ ధరకే బాడుగకు ఇస్తుండడం కొంత ఊరటనిచ్చే అంశం. అయితే ఇటీవల ఈ పథకం లేకపోవడంతో ప్రైవేట్ ట్రాక్టర్‌లకు డిమాండ్ పెరిగింది. అయితే ట్రాక్టర్ యజమాని శ్రీనాథ్ మాట్లాడుతూ డీజిల్ ధర విపరీతంగా పెరగడంతో బాడుగల ధర కూడా కొద్దిగా పెంచాల్సిన అనివార్యత పడిందన్నారు. కామసముద్రకు చెందిన రైతుసంఘం అధ్యక్షుడు వీ శంకర మాట్లాడుతూ పేద రైతులకు కృషి యంత్రధారె పథకం కింద వ్యవసాయ ఉపకరణాలను తక్కువ బాడుగకు ఇచ్చేవారన్నారు. ఆపేసిన ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరించడం ద్వారా పేదరైతులకు అనుకూలం కానుందన్నారు.


ట్రాక్టర్‌తో దుక్కులు ఇలా...

విరాట్ కోహ్లి తిరుగులేని క్రికెటర్


ప్రెసిడెన్సీ యూనివర్సిటీ క్యాంపస్‌లో లెజెండరీ క్రికెటర్ షేన్ వాట్సన్ తదితరులు

▸▸ షేన్ వాట్సన్ ప్రశంస

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): విరాట్ కోహ్లి తిరుగులేని క్రికెటర్ అని లెజెండరీ క్రికెటర్, వ్యాఖ్యాత, రచయిత షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డారు. యలహంకలోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీ క్యాంపస్‌లో షేన్‌వాట్సన్ ది విన్నర్స్ మైండ్‌సెట్ పుస్తకాన్ని లాంఛనంగా విడుదల చేశారు. ఇదే సందర్భంగా విద్యార్థులతో షేన్ వాట్సన్ క్రికెట్ ఆడడంతోపాటు సరదా ప్రశ్నలకు సూటిగా సమాధానాలు ఇచ్చారు. ఇండియన్ క్రికెట్ జట్టులో తిరుగులేని క్రికెటర్ ఎవరని అడిగిన ప్రశ్నకు విరాట్‌కోహ్లి అంటూ ప్రస్తావించారు. ఆల్‌రౌండర్‌గా మహేంద్రసింగ్ ధోనీపైనా ప్రశంసలు కురిపించారు. ధోనీ మైదానంలో ఉన్నప్పుడు ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. చాన్స్‌లర్ నిస్సార్ అహ్మద్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. విద్యార్థులతో మాట్లాడుతూ 2016 ఐపీఎల్ టోర్నీలో జట్టు ఓటమిపై ఆర్‌సీబీకి క్షమాపణలు చెప్పడాన్ని ప్రస్తావించారు. విద్యార్థులతో సెల్ఫీలు తీసుకుని, ది విన్నర్స్ మైండ్‌సెట్ పుస్తకాన్ని చదవాలని సూచించారు.

అంతర్జాతీయ టెన్నిస్ పోటీల్లో తాలూకా క్రీడాకారుడు

శిడ్లఘట్ట, మే 21: శిడ్లఘట్ట తాలూకా మేలూరు గ్రామానికి చెందిన ఎం పునీత్ భారతజట్టులో ప్రాతినిధ్యం వహించడం సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. నేపాల్‌లోని ఖాట్మండులో ఆరంభమైన దక్షిణ ఆసియా ఇంటర్నేషనల్ లాన్ టెన్నిస్ పోటీల్లో అండర్ 12 విభాగంలో శిడ్లఘట్ట తాలూకా మేలూరు నివాసి ఎం పునీత్ భారతజట్టు తరపున ప్రాతినిధ్యం వహించాడు. నేపాల్, భూటాన్, పాకిస్థాన్, మాల్దీవ్స్, బంగ్లాదేశ్, శ్రీలంక సహా భారత టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 12 విభాగంలో ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలు ఉన్నారు. శిడ్లఘట్ట తాలూకా మేలూరు గ్రామానికి చెందిన డాక్టర్ మనోహర్, నర్మత దంపతుల కుమారుడు పునీత్ ఉన్నారు. ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొన్న పునీత్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడం తాలూకా కీర్తిని ఇనుమడింప చేయడంపై హర్షం వ్యక్తం అవుతోంది. భారతజట్టు బాలుర బృందంలో ఎం పునీత్, ఆరవ్, చలాని, యువన్, గరగ్ ఉన్నారు. ఇందిరా కుంబార్ మహాజన్ కోచ్‌గా వ్యవ హరిస్తున్నారు. ఇక బాలికల జట్టులో ఖుషి ఖాదియాన్ శరనా, గెహ్లాట్, సృష్ట కిరణ్ ఉన్నారు. ఆశాశర్మ కోచ్‌గా మార్గదర్శకం చేస్తున్నారు.


నేపాల్‌లో భారతీయజట్టు బృందం

నాలుగు కిలోల ఫైబ్రాయిడ్ తొలగింపు


శస్త్రచికిత్స నిర్వహించిన వైద్య బృందం

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన కడుపునొప్పితోపాటు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న 42ఏళ్ల మహిళ గర్భాశయం నుంచి 4కిలోల ఫైబ్రాయిడ్‌ను తొలగించడం ద్వారా దక్షిణభారత్‌లో విజయవంతమైన శస్త్రచికిత్స చేశారు. ల్యాప్రోస్కోపిక్ సర్జన్ సునీల్ ఈశ్వర్ నేతృత్వంలో 42ఏళ్ల మహిళ కడుపు నుంచి 4 కిలోల కణితిని తొలగించారు. సాధారణంగానే గడుపుతున్న ఆమె గర్భాశయంలో వస్తున్న మార్పులకు చికిత్స కోసం ఏస్టర్ ఆర్‌వీ ఆసుపత్రికి వచ్చారన్నారు. స్కానింగ్ చేయగా గర్భాశయంలో 32 నుంచి 34 వారాల ఫైబ్రాయిడ్ ఉన్నట్టు గుర్తించారు. ల్యాప్రోస్కోపిక్ విధానంతో ఆపరేషన్‌ను చేశారు. 20-30శాతం మహిళల్లో ఫైబ్రాయిడ్‌లు ఉంటాయని అయితే ఇంతభారీగా ఉండే అవకాశాలు తక్కువ అన్నారు. కేవలం 3 సెంటీమీటర్ల ల్యాప్రోస్కోపిక్‌తో 4 కేజీల ఫైబ్రాయిడ్‌ను తొలగించేందుకు 5 గంటలపాటు శస్త్ర చికిత్స చేసినట్లు డాక్టర్ ఈశ్వర్ తెలిపారు. ఆపరేషన్ అయిన 48 గంటల్లో డిశ్చార్జ్ చేశామని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

నృసింహ జయంతి వేడుకలు

దేవనహళ్ళి, మే 21: స్థానిక బేగూరులోని వరలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అలంకరణ చేశారు. ఐదురోజులపాటు కార్యక్రమాలు కొనసాగుతాయని బేగూరు బ్రాహ్మణసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఎన్ మహేశ్ వెల్లడించారు. ప్రధాన అర్చకులు శ్రీరామశేష శర్మ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. స్థానిక ప్రముఖులు శ్రీకృష్ణమూర్తి సహా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అర్చకబృందం, భక్తులు


గురువందనలో పాల్గొన్న యోగాభ్యాసకులు

యోగాభ్యాసంతో చక్కటి ఆరోగ్యం

శిడ్లఘట్ట, మే 21: యోగ పతంజలి శిక్షణ సంస్థ ఎన్నో సంవత్సరాలుగా యోగాలో శిక్షణ ఇస్తోందని పతంజలి అంటే దేవుడితో సమానమైన భావన ఉందని యోగా ట్రైనర్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో మంగళవారం భరతమాతకు పూజలు చేసి గురువందన కార్యక్రమాన్ని అర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాలక్రితమే పతంజలి మానవాళికి గొప్ప యోగా సూత్రాలను అందజేశారన్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించే క్రమం తప్పని యోగాభ్యాసం పాటించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇటీవలికాలంలో యోగాకు ఆదరణ పెరిగిందని, పాశ్చాత్య దేశాలలో సైతం ఆచరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సుందరచారి, కేశవమూర్తి, రమణ, మౌలిని, మహేశ్, డీవీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

అనంతపురం టౌన్, మే21 : పేదలకు అండగా నిలిచి ఆరోగ్యాన్ని అందించిన ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. రూ.కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యాలు తిరుగు బావుటా ఎగరవేయడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించిన ప్రైవేటు, కార్పోరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సేవల నిలుపుదలకే నిర్ణయం తీసుకున్నారుయి. పలు మార్లు సేవల బంద్‌కు పిలుపునిచ్చినా ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతూ కొంత మొత్తాన్ని చెల్లిస్తూ వచ్చింది. దీంతో పాటు కొందరు ప్రభుత్వ పెద్దలు బెదిరింపులకు దిగడంతో సమ్మెను విరమించుకుంటూ వస్తున్నారు. తాజాగా అప్పులు చెల్లించాలని లేకపోతే బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చారు. ఈసారి ఎంత బెదిరించినా, బుజ్జగించినా వెనక్కి తగ్గేది లేదని, బకాయిలు చెల్లించేవరకు సేవలు అందించేది లేదని అసోషియన్ నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే జిల్లాలో 44 కార్పోరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కానున్నాయి. ఇప్పటికే ఆమేరకు జిల్లాలో కూడా ఆస్పత్రుల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు బంద్ అయితే తమ పరిస్థితి ఏంటని పలు పేదవర్గాలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వివిధ వ్యాదులకు సంబంధించి దాదాపు 500నుంచి 750మంది వరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందుతున్నారు. బంద్ చేస్తే సీ రియస్ కేసుల పరిస్థితి ఏంటనే ఆందోళన మొదలైంది. అయితే ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ను అడిగితే మాత్రం ఆరోగ్యశ్రీ సేవల బంద్‌కు నోటీస్ ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే రాష్ట్ర స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, బకాయిలు చెల్లించే అవకాశం ఉందని, దీంతో వైద్యసేవలు యథాతతంగా కొనసాగుతాయని తెలిపారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

అన్నమయ్య (జయంతి)



అన్నమయ్య లేదా తాళ్లపాక అన్నమాచార్యులు 1408 మే 22న కడప జిల్లా తాళ్లపాక గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్య చరిత్రలో లభించన ఆధారాల మేరకు తొలి వాగ్గేయకారుడు. ఆయనకు పదకవితా పితా మహుడు అనే బిరుదు ఉంది. దక్షిణాపథంలో భజన సంప్రదాయానికి, పదకవితా శైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి, అహోబిలం నరసింహస్వామి ఇతర దేవతామూర్తులను కీర్తిస్తూ 32వేలకుపైగా కీర్తనలు రచించారు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసుకుని ఉంటాయి. అన్నమయ్యను శ్రీనివాసుడి అవతారంగా కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు కొనియాడారు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనాచార్యులకు అన్నమయ్య మార్గదర్శకుడు. 1503 ఏప్రిల్ 4న పరమపదించారు.

రాజా రామ్‌మోహన్‌రాయ్ (జయంతి)



దేశంలో పేరొందిన గొప్ప సంఘ సంస్కర్త రాజా రామ్ మోహన్‌రాయ్ 1772 మే 22న బెంగాల్‌లోని రాధానగర్ జన్మించారు. దేశంలో తొలి సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారు. ఆయన ప్రభావం రాజకీయ, ప్రభుత్వ నిర్వహణ, విద్యారంగాలలోనే కాక హిందూమతంపైన కూడా చూపింది. అప్పటి సతీ సహగమన సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి ఎనలేని కృషి చేశారు. వితంతు పునర్వివాహనికి మద్దతు ఇచ్చి, స్త్రీ విద్యకు పాటుపడ్డారు. బ్రహ్మసమాజ్‌ను స్థాపించి బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ముఖ్యులుగా గుర్తింపు పొందారు. 1833 సెప్టెంబరు 27న కన్నుమూశారు.

బెళగెరె కృష్ణశాస్త్రి (జయంతి)




గాంధేయవాదిగా గుర్తింపు పొందిన బెళగెరె కృష్ణశాస్త్రి 1916 మే 22న చిత్రదుర్గ జిల్లా బెళగెరెలో జన్మించారు. సరళ, సాదాసీదా వ్యక్తిత్వానికి ఆయన మారుపేరు. కన్నడ రచయిత, తత్వవేత్తగా రాణించారు. భూదాన్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఉత్తర కర్ణాటకలో గ్రామస్థుల సహకారంతో ఎన్నో పాఠశాలలు నిర్మించారు. బెళగెరె గ్రామంలో శ్రీ శారదా మందిర ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర, కేంద్ర నుంచి అత్యుత్తమ అధ్యాపక పురస్కారం, 'హళ్ళి చిత్ర' నాటకానికి కేంద్ర నాటక అకాడమీ పురస్కారం, అళ సింగాచార్, ఆకాశవాణి పురస్కారం, రాజ్యోత్సవ పురస్కారం పొందారు. 2013 మార్చి 22న కన్నుమూశారు.

ప్రసన్న (పుట్టినరోజు)



ఈఏఎస్ ప్రసన్నగా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత ఎర్రపల్లి అనంతరావు శ్రీనివాస్ 1940 మే 22న బెంగళూరులో జన్మించారు. కర్ణాటకలో రంజీ ట్రోఫీలో ఎంతగానో రాణించారు. 1961లో మద్రాస్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్‌క్రికెట్ మ్యాచ్‌లో స్పిన్ బౌలర్‌గా సత్తా చాటుకున్నారు. 20 టెస్టులలో 100 వికెట్లు సాధించారు. మైసూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌నుంచి పట్టా పొందారు. 1970లో పద్మశ్రీ, 50 టెస్ట్‌మ్యాచ్‌లకంటే ఎక్కువగా పాల్గొన్నందుకు 2012లో బీసీసీఐ నుంచి కాస్ట్రల్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం పొందారు.

నోవక్ జకోవిచ్ (పుట్టినరోజు)



నోవక్ జకోవిచ్ 1987 మే 22న జన్మించారు. సెర్బియా దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారుడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) చే 'వరల్డ్ నెంబరు 1' గా గుర్తింపు పొందారు. 426 వారాలపాటు రికార్డు కొనసాగింది. 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ మెన్స్ సింగిల్స్, 82 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ కైవశం చేసుకున్నారు. వీటిలో రాఫెల్ నడాల్‌తో కలసి 36 మాస్టర్ ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. ఏటీపీలో ప్లేయర్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా వ్యవ హరించారు. సమాజసేవ కార్యక్రమాలతో ప్రశంసలు పొందారు. యునిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్నారు.

శివపురంలో వైసీపీ రౌడీయిజం

శింగనమల, మే 21: ఎన్నికల్లో టీడీపీ కోసం పని చేసినందుకు వైసీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. శింగనమల మండలం శివపురంలో టీడీపీ కార్యకర్త ఇంట్లోకి మంగళవారం సాయంత్రం చొరబడి కొడవళ్లతో దాడి చేశారు. దీంతో నలుగురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బోయ పెద్దన్న, కొండప్ప అన్నదమ్ములు. వీరు టీడీపీ కార్యకర్తలు. పెద్దన్నకు అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకడు పట్రా వెంకటప్ప కుటుంబానికి పొలం వద్ద రస్తా తగాదా ఉంది. ఎన్నికల్లో పెద్దన్న టీడీపీ తరఫున పనిచేశారు. దీంతో ఆ పార్టీ కోసం పనిచేయొద్దని వైసీపీ నాయకులు పెద్దన్నను పలు మార్లు హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా పనిచేయడంతో వైసీపీ నాయకులు కక్ష కట్టారు. వైసీపీ వర్గీయులు ప్రసాద్, మురళి, శేఖర్, రాజు, వెంకటరమయ్య, భాస్కర్, క్రాంతి తదితరులు మద్యం సేవించి పెద్దన్న ఇంటిపై దాడి చేశారు. పెద్దన్న వారి నుంచి తప్పించుకుని, తన అన్న కొండప్ప ఇంట్లోకి దూరాడు. వెంబడించిన వైసీపీ వర్గీయులు.. కొండప్ప ఇంట్లోకి చొరబడి కొండప్ప, ఆయన కూతురు హిమాజకుమారి, అల్లుడు మురళి, పెద్దన్న భార్య పద్మావతిపై దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో నలుగురినీ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని శింగనమల ఏఎస్ఐ చితంబరప్ప తెలిపారు.

సహాయనటి విద్య దారుణహత్య


విద్య (ఫైల్)

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా బన్నూరు సమీపంలోని తురగనూరులో కాంగ్రెస్ నాయకురాలు, సహాయనటి విద్య (36) దారుణహత్యకు గురయ్యారు. సోమవారం రాత్రి ఆమె భర్త నందీశ్ హత్య చేసి పరారీ అయ్యాడు. మైసూరు శ్రీరాంపుర నివాసి విద్యా రాత్రి పొద్దుపోయాక తురగనూరులోని భర్త ఇంటికి వెళ్లారు. ఇరువురి మధ్య గొడవ జరిగింది. భర్త నందీశ్ భార్యపై దాడి చేశాడు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆమె మృతి చెందారు. బన్నూరు పోలీసులు మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మైసూరు నగర కాంగ్రెస్ మహిళా విభాగంలో విద్య చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగాను వ్యవహరించారు. ప్రస్తుతం మైసూరు నగర విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. భజరంగి, వజ్రకాయ పలు సినిమాలలో సహాయ నటిగాను నటించారు.

అథణి ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి మహిళ దుర్మరణం


శోభా తేళి (ఫైల్)

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ డీసీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ్ సవదికి చెందిన మొక్కజొన్నలు పాలిష్ చేసే ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి ఓ మహిళా కార్మికురాలు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అథణి తాలూకా చిక్కట్టి శివారులోని ప్రియా ఎక్స్‌పోర్ట్స్ ఫ్యాక్టరీలో మంగళవారం బాయిలర్ పేలింది. హై ప్రెజర్‌తో పేలుడు సంభ వించగా భారీగా మంటలు చెలరేగాయి. ముగ్గురు తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలిస్తుండగా శోభా తేళి అనే మహిళ మృతి చెందారు. మరో ఇద్దరు ఆసు పత్రిలో చికిత్స లు పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

నేడు నృసింహ జయంతి
ముస్తాబైన ఖాద్రీశుడి ఆలయం


ముస్తాబైన ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

కదిరి, మే 21: నృసింహజయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో వెలసిన ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, వాహనసేవ నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. స్వాతి నక్షత్రం సందర్భంగా నృసింహజయంతి నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడై వసంత వల్లభుడు శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారన్నారు. నృసింహ జయంతికి ఖాద్రీశుడి ఆలయం ముస్తాబైంది. ప్రత్యేక అలంకరణ, ఏర్పాట్లు చేపట్టారు.

రేపు మల్లెపూలోత్సవం

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి గురువారం మల్లెపూల మండపంలో మల్లెపూలోత్సవాన్ని నిర్వహించనున్నారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం సాయంత్రం 4గంటలకు స్వామివారు ఆలయం నుంచి బయలుదేరి మల్లెపూల మండపానికి చేరుతారన్నారు. కదిరి మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

తాడిపత్రికి మళ్లీ సిట్
● పోలీసులకు కునుకు కరువు

తాడిపత్రి టౌన్, మే 21: సిట్ బృందం తాడిపత్రికి మరోసారి వచ్చింది. పోలింగ్, ఆ మరుసటి రోజు జరిగిన గొడవల గురించి సిట్ అధికారులు మంగళవారం మరోమారు విచారించారు. సిట్ సభ్యులు శ్రీనివాసులు, భూషణం, శ్రీనివాస్ తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. రికార్డులను, అల్లర్లకు సంబంధించిన వీడియోలను పరిశీలించారు. హింసాత్మక ఘటనల గురించి పూర్తిస్థాయి వివరాలు సేకరించేందుకు మరోసారి వారు వచ్చినట్లు సమాచారం. గొడవ జరగడానికి ప్రధాన కారణం, రాళ్ల దాడి జరిగినా పోలీసులు ఎందుకు నియంత్రించలేక పోయారని స్థానిక పోలీసులను అడిగినట్లు తెలిసింది. గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఎస్‌బీ అధికారులు ముందే గుర్తించి సమాచారం ఇచ్చారా..? లేదా..? సమాచారం ఇచ్చినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా..? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేస్తోందని సమాచారం. తాడిపత్రి గొడవల నేపథ్యంలో ఇప్పటికే ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ సస్పెండ్ అయ్యారు. సిట్ దర్యాప్తు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని పోలీసులు ఆందోళన చెందు తున్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సిట్ బృందం తాడిపత్రిలోనే తిష్ట వేస్తుం దని ప్రచారం సాగుతోంది. దీంతో స్థానిక పోలీసులకు కంటిమీద కునుకు కరువైంది.